సమస్యల తిష్ట


శాంతినగర్‌కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం

- అధ్వాన రహదారులు.. కనీస సౌకర్యాలు కరువు
- వరహాల స్వైర విహారం
- ఇదీ 9వ వార్డులో పరిస్థితి

మొత్తం జనాభా: 6,195

ప్రధాన వీధులు: పాలకొండ, పాలకొండ తండా, హీరాబాయినగర్, మర్లు (కొంతభాగం), భాగ్యలక్ష్మినగర్, ధనలక్ష్మినగర్, వీరభద్రకాలని, విజయనగర్ కాలని, బృందావన్‌కాలని, న్యూకాలని, ఆదర్శకాలని, పంచముఖికాలని, శాంతినగర్ (కొంతభాగం).

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండ నుంచి బైపాస్ రోడ్డు వరకు అర కిలోమీటరు రహదారి ఎక్కడికక్కడ దెబ్బతింది. అప్పట్లో కొంత బీటీ, మరికొంత సీసీ రోడ్డు వేశారు. కుంటకట్ట సమీపంలో ఉన్న నీటిట్యాంకు నిండి నీరు వృథా కావడంతో పాటు ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారైంది. దోమలు, పందుల విహారం పెరిగి రోగాలబారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఆ ప్రాంతంలోని ఓ ఇంటి మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇక మర్లు వెళ్లే బీటీ, సీసీరోడ్డుపై పలుచోట్ల అడ్డంగా గుంతలు తవ్వి సరిగా పూడ్చలేదు. భాగ్యనగర్‌కాలనీ వేగంగా విస్తరిస్తున్నా.. కనీస సౌకర్యాలు కరువయ్యాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అయ్యప్పగుట్టకు పక్కనే ఉండటంతో వర్షాకాలంలో మట్టి రోడ్లపై నీరు ఏరులై పారుతోందని.. రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ధనలక్ష్మికాలనీలోనూ అదే పరిస్థితి నెలకొంది. నల్ల పోచమ్మ ఆలయం నుంచి ధనలక్ష్మికాలనీ చివర వరకు ఉన్న రోడ్డుపై మూడు, నాలుగు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. విజయనగర్‌కాలనీలో మిషన్ భగీరథ కొళాయి కనెక్షన్ తీసుకున్నవారు వాటిని సరిగా పూడ్చకపోవడంతో సీసీ రోడ్లపై ఎక్కడబడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. శాంతినగర్‌కాలనీలోని ఒకటో వీధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. రెండు, మూడు గల్లీల్లో డ్రెయినేజీలు, సీసీరోడ్లు నిర్మించలేదు. ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయిందని, పుర పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోయారు. అలాగే స్తంభాలు లేక కర్రలపైనే సర్వీసు వైర్లు లాగడంతో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి.

రహదారులు శుభ్రం చేయడం లేదు..



మా వీధిలో రోడ్లు ఊడ్చడానికి పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదు. దీంతో ఎక్కడికక్కడ చెత్తా చెదారం పేరుకుపోయింది. రెండు, మూడు గల్లీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించలేదు. స్తంభాలు ఏర్పాటుచేయకపోవడంతో కర్రలపైనే విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నాం. కుక్కలు, పందుల బెడద అధికంగా ఉండటంతో చిన్నారులను బయటకు పంపాలంటే భయమేస్తోంది. ఇంటిపన్ను చెల్లిస్తున్నా.. కాలనీ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. – మంగమ్మ, శాంతినగర్

పందుల సంచారం పెరిగింది..



బీటీరోడ్డు పక్కన పావు కిలోమీటరు మేర డ్రెయినేజీ నిర్మించలేదు. అందులో పందులు పొర్లాడుతున్నాయి. మా కాలనీ గుట్ట పక్కనే ఉండటంతో వర్షపునీరు గల్లీలోకి వస్తోంది. కాలనీ శరవేగంగా విస్తరిస్తున్నా.. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.
– రవి, కిరాణ దుకాణం, ధనలక్ష్మికాలని

అభివృద్ధి పనులు చేపడుతున్నాం..



మూడేళ్లలో రూ.3.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ఇంకా కొన్ని కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. పాలకొండలో అర కిలోమీటరు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. అలాగే సుమారు రూ.25 లక్షలతో మూడు సామూహిక భవనాలను నిర్మిస్తున్నాం. భాగ్యనగర్‌కాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. – మూశ నరేందర్, వార్డు కౌన్సిలర్


ధనలక్ష్మినగర్‌కాలనీలో డ్రెయినేజీ లేక రోడ్డుపక్కన పారుతున్న మురుగు


పాలకొండలో అధ్వానంగా మారిన సీసీ రహదారి

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం తనిఖీ



బాలానగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని గురువారం అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ మహేష్ తనిఖీ చేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వారి వెంట సీఐ జమ్ములప్ప, ఎస్ఐ జయప్రసాద్ ఉన్నారు.

జడ్చర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అదనపు ఎస్పీ రాములు గురువారం పరిశీలించారు. జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేశ్, ఎస్‌బీ డీఎస్పీ ఆదినారాయణ, సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐ లెనిన్ ఉన్నారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మహమ్మదాబాద్: ఓ గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే.. గాధిర్యాల్‌కు చెందిన అనిత గురువారం ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకొన్న వాహనంలో గండేడ్ ఆస్పత్రికి తరలిస్తుండగా నంచర్ల సమీపానికి చేరుకోగానే నొప్పులు అధికమై ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను గండేడ్ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి కాన్పుకు సహకరించిన 108 సిబ్బంది ఈఎంటి సాయికుమార్, పైలెట్ చాంద్‌పాషాకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టు షాపులు తొలగించాలని వినతి

పాలమూరు: బెల్టు షాపులు, దాబాల్లో మద్యం విక్రయిస్తుండటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని పండుగ సాయన్న సామాజిక సేవాసంస్థ, మన పాలమూరు అభివృద్ధి ఫోరం, ముదిరాజ్ సేవాసమితి సభ్యులు గురువారం సీఐ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

హుండీ లెక్కింపు



దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. రూ.1,98,290 ఆదాయం సమకూరినట్లు ఈఓ కోమల్, ఆలయ కమిటీ చైర్మన్ శివానంద్ తెలిపారు. ఉగాది తరువాత సప్తాహ మహోత్సవాలు ఉండటంతో ముందుగా హుండీ లెక్కించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'సంపూర్ణ హృదయంతో ప్రార్థించాలి'



స్టేషన్ మహబూబ్‌నగర్: దేవుడి మాటలను ధ్యానిస్తూ, సంపూర్ణ హృదయంతో ప్రార్థించే వారిగా ఉండాలని హోసన్న మినిస్ట్రీస్ నిర్వాహకుడు పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంబీసీ మైదానంలో ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు పాస్టర్ బి.జెర్మియా అధ్యక్షతన సువార్త స్వస్థత మహాసభలు గురువారం రాత్రి రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పాస్టర్ జాన్‌వెస్లీ ప్రసంగిస్తూ.. దేవుడిపై భారాన్ని మోపితే మన సమస్యలన్నీ సులువుగా తొలగిపోతాయన్నారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి తన రక్తాన్ని చిందించి పాప విమోచనను అనుగ్రహించారని వివరించారు. అనంతరం వివిధ రోగాల బారిన పడిన వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ఎంబీసీ చైర్మన్ రెవ వరప్రసాద్, రెవ బీఎస్.పరంజ్యోతి, రెవ సుందర్‌పాల్, ఏసుపాదం, జాన్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల టౌన్: హిందూవాహిని పట్టణ కార్యవర్గాన్ని జిల్లా ప్రముఖ్ సూరారకం రాకేష్ గురువారం ప్రకటించారు. పట్టణంలోని పాతబజార్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో నగర సంయోజక్‌గా విక్కి, సహ సంయోజక్‌లుగా వల్లెపు శంకర్, ప్రదీప్ ఎన్నికయ్యారు. నాగరత్నం, రమేష్, చరణ్, భాస్కర్, సాయి, ప్రభాకర్ పాల్గొన్నారు.

జ్ఞానసీలి మెరుపు బహుజన..

మహబూబ్‌నగర్ రూరల్: గాజులపేటలో గురువారం జ్ఞానసీలి మెరుపు బహుజన మహనీయుల శోభాయాత్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.వెంకటయ్య, ప్రధానకార్యదర్శిగా ఉదయ్‌కిరణ్, సహాయ కార్యదర్శిగా స్వామి, కోశాధికారిగా భీమయ్య, కార్యవర్గసభ్యులుగా రాజు, కేశవులు, నరేష్, నర్సిములు, టి.రాజు, చెన్నకేశవులు, భీమేష్, మధు, మహేష్‌బాబు, పవన్‌కళ్యాణ్, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా కన్వీనర్ పాతూరి రమేష్, పాత పాలమూరు 11వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు దిలీప్‌కుమార్, దినేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

కందూర్‌లో హోలీ సంబరాలు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో రామలింగేశ్వరస్వామి రథోత్సవం ముగిసిన మరుసటిరోజు హోలీ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గురువారం ఉదయం రంగునీళ్లను మట్టి కుండల్లో తీసుకొచ్చి తప్పెట్లు కొడుతూ ఇతర ఆలయాల్లో చల్లారు. అనంతరం గ్రామస్తులు హోలీ పండగ జరుపుకొన్నారు. చిన్నారులు, యువత ఆనందంతో నృత్యాలు చేశారు. తర్వాత రంగునీళ్లను తీసుకొని ఆలయానికి వెళ్లారు.


హోలీ వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కోటాలో బీసీలకు అన్యాయం'

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న బీసీలకు ఎమ్మెల్సీగా ఎందుకు అవకాశం ఇవ్వలేదని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.ప్రభాకర్ ప్రశ్నించారు. గురువారం బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ జనాభా ఉన్న అగ్రకులాలకు మూడు ఎమ్మెల్సీలు ఇచ్చి బీసీలకు మాత్రం అన్యాయం చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఒక్కరికి కూడా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మహబూబ్‌నగర్ పాత్ర ఎంతో ఉందని.. బీసీలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు అక్తర్‌బేగం, రవికుమార్, అనురేఖ, మాధవి, రాజేశ్వరి, శ్రీలత, సంధ్య, సౌజన్య, శాంత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్

కక్ష సాధింపు సరికాదు : బీఆర్ఎస్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతిపక్ష ప్రభుత్వాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని సామాజికవేత్త, బీఆర్ఎస్ నాయకుడు హనీఫ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న తెలంగాణ, కేరళ, తమిళనాడు, ఢిల్లీ ప్రభుత్వాలను పడగొట్టేందుకు చూస్తుందని.. అందులో భాగంగానే సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం, విచారణకు ఢిల్లీకి రావాలని ఆదేశించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతుందని ఆరోపించారు.

కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి : బీజేపీ

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగైదు రోజులు చాలా కీలకమని.. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పవన్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక ప్రేమ్‌రంగా గార్డెన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ తరువాత జడ్చర్ల నియోజకవర్గంలోనే అత్యధిక ఓట్లు ఉన్నాయని.. ఓటర్లను మరోసారి కలిసి తమపార్టీ అభ్యర్థికే ఓటు వేసేలా, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు డా. మధుసూదన్‌యాదవ్, సామల నర్సింహులు, సామల నాగరాజు, సాహితి పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: సంపూర్ణ ఆరోగ్యం కోసం అందరూ ధ్యానాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం నిజాలాపూర్ శివారులో ధ్యాన ఉస్మానియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాము నిర్మించిన ధ్యాన, ధర్మ ఆశ్రమాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ధ్యానంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని.. యువత ధ్యానం వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం ధ్యాన ఆశ్రమంలో కాసేపు ధ్యానం చేశారు. ఇదిలా ఉండగా నిజాలాపూర్‌లో గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, సర్పంచ్ సత్యమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, ఆశ్రమ నిర్వాహకుడు రాము, కడ్తాల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మి, నాయకులు కొండయ్య, మశ్చందర్‌నాథ్, జె.శ్రీనివాస్, భీమయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారు దుందుభి వాగు నుంచి గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ తిమ్మాజీపేట మండలం రాళ్లచెరువుతండాకు చెందినదిగా గుర్తించామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

జడ్చర్ల: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. మినాజ్, ఖాజా, శ్రీను, ఆనంద్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కాటేపల్లిని గెలిపించాలి'

స్టేషన్ మహబూబ్‌నగర్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాటేపల్లి జనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. జనార్దన్‌రెడ్డి 12ఏళ్ల నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేస్తూ ఉపాధ్యాయుల అనేక సమస్యలకు పరిష్కారం చూపారని పేర్కొన్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాన్ని అందేటట్టు చేశారని, మహిళా ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులు 180 రోజులు మంజూరు చేయించినట్లు తెలిపారు. సీఎంను ఒప్పించి ఉద్యోగ విరమణ వయస్సు 61 ఏళ్లు పెంచారని, 30శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్‌సీని ఇప్పించిన ఘనత సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కాటేపల్లి జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమాజంలో మహిళ స్థానం గొప్పది


సన్మానం పొందిన మహిళలతో న్యాయమూర్తి సంధ్యారాణి, న్యాయమూర్తులు, క్లబ్ సభ్యులు

హన్వాడ: సమాజంలో మహిళ స్థానం ఎంతో గొప్పదని ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం మహిళా ఉపాధ్యాయులు సాజిదాబేగం, సల్మాన్‌బేగం, నూర్జహాన్, సాబేరాబేగం, జివేరియా బేగంను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆడపిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకొనేలా చూడాలని కోరారు. బాల్య వివాహాలను అరికట్టి ఉన్నతస్థాయి చేరుకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, హఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ద్వారకామయి సాయిబాబా ఆలయ సమావేశం మందిరంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి హాజరై మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీపీ ఉమామహేశ్వరి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మండ్ల రాములు, అశోక్‌కుమార్ యాదవ్, ప్రసాద్, మృత్యుంజయ, చంద్రకాంత్ రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, మోహన్‌గౌడ్, బాలయ్య, లక్ష్మీనారాయణ, చిన్నయ్య, రాజభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం : సీపీఎం

చిన్నచింతకుంట: అమ్మాపురం గ్రామ రైతులకు అండగా ఉంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. మండలంలోని అమ్మాపూర్ సమీపంలో కురుమూర్తిస్వామి గుట్టల వెనుకభాగంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్రషర్ పనులను వెంటనే నిలిపివేయాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. క్రషర్ పనులతో పంటలు పండటం లేదని, వేసిన బోరుబావులు పూడుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల వెంట లారీలు, ట్రాక్టర్లు తిరుగుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనన్న భయం వెంటాడుతుందని తెలిపారు. మైనింగ్ అధికారులు స్పందించి పనులు నిలిపివేయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కడియాల మోహన్, ఉపాధ్యక్షుడు మద్దూరు రవీందర్, సీపీఎం సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్, జగన్, హన్మంతు, భగవంతు, రైతులు ఆంజనేయులు, శివకుమార్, తొర్రి రాములు, తిమ్మమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాములు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- టీడబ్ల్యూఓ జరీనాబేగం

నవాబుపేట: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని టీడబ్ల్యూఓ జరీనాబేగం, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ, ఎంపీడీఓ శ్రీలత కోరారు. ప్రీమియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నేను మహిళను అనే చిన్నపాటి సందేహాన్ని మనసులో నుంచి తొలగించి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని పురుషులతో సమానంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా నాయకులు నాగభూషణం, వెంకటేశ్వర్లు, నర్సిములు, శారదమ్మ, సర్పంచ్ గోపాల్‌గౌడ్, వేణునాథం, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడబ్ల్యూఓ జరీనాబేగం

పెండింగ్ మస్టర్లను పూర్తిచేయండి



గండేడ్: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న మస్టర్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీడీ జకియా సుల్తానా కోరారు. గురువారం మండలంలోని బల్సూర్‌గొండ నర్సరీని సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో 349 మస్టర్లు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటికి ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ అప్‌డేట్ చేయించాలని కోరారు. కూలీల వేతన చెల్లింపు ప్రస్తుతం సగటున రూ.187 ఉందని.. పని చేయించి రూ.250కి పెరిగేలా చూడాలని సూచించారు. బల్సూర్‌గొండ నర్సరీలో మొక్కల సంఖ్య, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అంబుడ్స్‌మెన్ సంతోషి, ఏపీఓ హరిశ్చంద్రుడు, సీఓలు, ఆయా గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

'బీజేపీలో చేరుతా'

గండేడ్: పరిగి నియోజకవర్గానికి చెందిన కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌రెడ్డి బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. దోమ మండలం మోత్కూరుకు చెందిన ఈయన కేఎస్ఆర్ ట్రస్ట్ స్థాపించి నియోజకవర్గంలోని మండలాల్లో పలు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. త్వరలో కేంద్ర నాయకత్వం ఆధ్వర్యంలో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన



చిన్నచింతకుంట: అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం కో–ఆర్డినేటర్ అశోక్‌చారి కోరారు. గురువారం అప్పంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు నమోదుపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. సమాజంలో ఓటుకు ఎంతో విలువ ఉందని.. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకొనే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. విద్యార్థులు సైతం బంధువులు, స్నేహితులకు ఓటు విలువను వివరించాలన్నారు. కార్యక్రమంలో విద్యానందాచారి, ఉదయ్‌కుమార్, లక్ష్మణ్, పద్మ, మల్లమ్మ, జానకమ్మ, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, చక్రవర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి

మిడ్జిల్: కంటివెలుగు శిబిరాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి కోరారు. గురువారం మండలంలోని వేములలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రజలతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరాతీశారు. అద్దాలు ఇస్తున్నారా.. వాడితే చూపు బాగా కనిపిస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కంటివెలుగు కార్యక్రమం ద్వారా ఎంతో మందికి కంటి సమస్యలు తగ్గాయని తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యురాలు యశోద, డా. కృష్ణకుమార్, జంగయ్య, దేవయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, నాయకులు బాలు, జంగారెడ్డి, సుదర్శన్, భీంరాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి..

జడ్చర్ల: స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా. సి.లక్ష్మారెడ్డి తెలిపారు. పట్టణంలో ఎస్సీ కార్పొరేషన్ అందించిన రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ మల్టి ఫ్లెక్స్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షల సాయం అందిస్తుందని.. స్వయం ఉపాధితో లబ్ధి పొందాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్ నంద కిషోర్‌గౌడ్, నాయకులు రామ్మోహన్ ఇమ్ము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


కంటివెలుగు శిబిరంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఆర్థిక సాయం అందజేత..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఎంపీడీఓ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పంక్చర్ దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితుడు అలీంకు ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి పంపించిన రూ.25 వేల నగదును గురువారం సాయంత్రం వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ అందజేశారు. బుధవారం తెల్లవారుజామున పంక్చర్ దుకాణంలో అగ్ని ప్రమాదం జరగా విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి రూ.25 వేలు పంపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.